
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 29 జూన్ 2025







ఇంద్రకీలాద్రికి రోప్‌వే

సీతమ్మవారి పాదాలు-ఓం టర్నింగ్-భవానీ ఐల్యాండ్

- దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారుల ప్రతిపాదన
- గతంలో రెండుసార్లు ప్రతిపాదించిన ఏపీటీడీసీ అధికారులు
- గందరగోళ అలైన్‌మెంట్ల కారణంగా తిరస్కరణ
- దేవదాయ మంత్రి వద్దకు చేరిన తాజా ప్రతిపాదన
- పర్వతమాల ప్రాజెక్టు కింద చేపట్టాలని భావన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగన్మాత కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి ఇంద్రకీలాద్రి వచ్చే భక్తుల కోసం దేవస్థాన అధికారులు రోప్‌వే ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గతంలో రెండుసార్లు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులు ఈ ప్రాజెక్టును ప్రతిపాదించగా, ఈసారి మాత్రం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులే తెరపైకి తెచ్చారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దుర్గగుడి ఈవో శీనానాయక్ ఈ ప్రతిపాదన చేశారు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) పర్వతమాల పథకం కింద దీనిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సీతమ్మవారి పాదాల నుంచి ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ వరకు, తిరిగి భవానీ ఐల్యాండ్ వరకు ఈ ప్రతిపాదన చేశారు. దేవస్థానం, ప్రభుత్వంపై ఖర్చు పడకుండా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో దీనిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

గతంలో రెండుసార్లు ప్రతిపాదనలు

రోప్‌వే ప్రాజెక్టు కోసం గతంలో రెండుసార్లు ఏపీటీడీసీ అధికారులు ప్రతి పాదన పెట్టారు. రాజీవ్‌గాంధీ పార్కు నుంచి దుర్గగుడిపైకి ఒకటి, రాజీవ్ గాంధీ పార్కు నుంచి దుర్గగుడికి.. అక్కడి నుంచి మిగతా 6లో..

ఇంద్ర వైభవం

కనకదుర్గానగర్ రెండోదశ విస్తరణకు శ్రీకారం

గోశాల నుంచి మల్లేశ్వరాలయం దాటే వరకు..

- దుర్గగుడి అధికారుల ప్రతిపాదనకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- సంప్రదింపులతో భూమి సేకరించాలని ఆదేశాలు
- పరిహారంపై నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచన
- రెండు స్కూళ్లు, నాలుగు ఇళ్లు తొలగించే అవకాశం
- మూడోదశ విస్తరణకూ ఒప్పుకొంటే కాటేజీలు నిర్మించే చాన్స్

ఇంద్రకీలాద్రి మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా కనకదుర్గానగర్ రెండోదశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన భూసేకరణ జరపటానికి ఆమోదముద్ర వేసింది. ఈ ప్రక్రియ సంప్రదింపుల మార్గంలో నడవాలని నిర్దేశించింది. భూములు తీసుకోవాల్సిన వారితో ముందుగా మాట్లాడి, పరిహారానికి సంబంధించి వారు ఎంత కోరుకుంటున్నారో తెలుసుకోవాలని దుర్గగుడి యంత్రాంగానికి ప్రభుత్వం సూచించింది. బాధితులతో మాట్లాడాక సమగ్ర నివేదిక పంపాలని దేవస్థాన అధికారులకు నిర్దేశించింది.



కనకదుర్గానగర్‌లో విస్తరించాల్సిన ప్రాంతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తొలిదశ విస్తరణలో అర్జునవీధికి అభిముఖంగా మొత్తం 187 ఇళ్లను తొలగించారు. ఆ తర్వాత దేవస్థాన అధికారులు ప్రహరీ నిర్మించారు. ఈ భూసేకరణ వల్ల మహామండపం వద్ద ప్రాంతం విశాలంగా మారింది. అలాగే, అన్నదానసత్రం, లడ్డూ పోటు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొత్తగా భవనాలు నిర్మిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతం మళ్లీ ఇరుగ్గా మారింది. మాస్టర్‌ప్లాన్ ప్రకారం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. దీంతో రానున్న రోజుల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రెండోదశ విస్తరణకు శ్రీకారం చుట్టారు.

రెండో దశలో..

ప్రస్తుత మహామండపం నుంచి మల్లేశ్వరస్వామి ఆలయం దిగువన ఉన్న ప్రాంతం మొత్తాన్ని రెండో దశలో భాగంగా భూసేకరణ జరపాలని దేవస్థాన అధికారులు మిగతా 6లో..

మూడో దశలో..

మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇంద్రకీలాద్రి సమగ్రాభివృద్ధికి మూడో దశ భూములు కూడా అవసరం. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయమైన ఇంద్రకీలాద్రికి అశేషసంఖ్యలో భక్తులు వస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు తిరుపతి తరహాలో ఇక్కడ కాటేజీలు అందుబాటులో లేవు. కనకదుర్గానగర్ దిగువన తగిన స్థలం ఉంటే ఇక్కడ మల్టీప్లెక్స్‌లతో కూడిన కాటేజీలను ఏర్పాటు చేయవచ్చు. దీనివల్ల విజయవాడ వచ్చినవారు రెండు, మూడు రోజులు ఇక్కడే గడిపే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే మూడోదశ విస్తరణకు కూడా ఇదే మంచి తరుణం.

నూతన ప్రాజెక్టును ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత. చిత్రంలో సీపీ రాజశేఖర్‌బాబు, ఎంపీ కేశినేని చిన్ని, ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, కొలికపూడి శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, బొండా ఉమా, శ్రీరాం తాతయ్య



ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రతకు 'డివైన్ సురక్ష' 8

- నూతన ప్రాజెక్టును ఆవిష్కరించిన హోంమంత్రి అనిత
- అన్ని ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు సీసీ కెమెరాలు

సీతారామపురంలోని స్థలం ఇదే..



పున్నయ్య స్థలాలు హాంఫట్

సీతారామపురంలో దేవదాయ స్థలం విక్రయం

- దాతల సదాశయానికి తూట్లు
- పట్టించుకోని అధికారులు

వన్‌టౌన్ /గుణదల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖకు చెందిన ఆస్తులు కబ్జాకు గురవుతున్నా, విక్రయ లావాదేవీలు జరుగుతున్నా అధికారులు తమకేం సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. కబ్జాదారుల నుంచి ఆమ్యామ్యాలు దండుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దాతల ఆశయాలకు తూట్లు పొడుస్తూ, వారి ఆస్తులను అడ్డగోలుగా విక్రయించేందుకు కబ్జాదారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

దాతలిచ్చిన స్థలంలో దారుణాలు

నగరానికి చెందిన కూనాల పున్నయ్య అనే వ్యక్తి 1922లో సుమారు రూ.30 వేలతో కూనాల పున్నయ్య అన్నసత్రం ఏర్పాటుచేశారు. కాలినడకన మిగతా 6లో..

ధాన్యం బకాయిలేవీ?

జిల్లాలో రూ.12 కోట్ల వరకు పెండింగ్

- రెండు నెలలుగా అందని బిల్లులు
- ఖరీఫ్, రబీ ధాన్యం విక్రయించినవే..
- పౌరసరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- హమాలీ, రవాణా చార్జీలూ పెండింగ్‌లోనే..
- త్వరగా విడుదల చేయాలని వేడుకోలు



ఖరీఫ్ ధాన్యం బకాయిల కోసం జిల్లాలోని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్, రబీ ధాన్యం విక్రయించి రెండు నెలలువుతున్నా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వారంతా పౌరసరఫరాల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల కావస్తోంది. గత ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ధాన్యం బకాయిలు కొంతమేర ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. 80 రోజులుగా ధాన్యం బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో ఈ బిల్లుల కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. 2025కు సంబంధించి ఖరీఫ్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులకు ఈ నగదును వాడుకుంటామని, బిల్లులు మంజూరు చేయాలని రైతులు జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే, పెండింగ్ బిల్లులు త్వరలో రైతుల ఖాతాల్లో జమ అవుతాయని పౌరసరఫరాల సంస్థ కార్యాలయ అధికారులు చెబుతున్నారు.

రెండు నెలలుగా పెండింగ్

ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో 70 వేల మందికి పైగా రైతుల నుంచి 6.09 లక్షల టన్నుల ధాన్యాన్ని కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 48 గంటల్లోనే ధాన్యం బిల్లులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. మొత్తం రూ.1,406 కోట్లను జమ చేశారు. మార్చి, ఏప్రిల్‌లో జిల్లాలోని 3,630 మంది రైతుల నుంచి ఖరీఫ్‌లో మిగులుబాటుగా ఉన్న ధాన్యం, రబీలో రైతులు పండించిన ధాన్యం 23,190 టన్నులను ప్రభుత్వం కొనింది. రూ.46.09 కోట్ల ధాన్యం బిల్లులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. మార్చి నెలాఖరులో, ఏప్రిల్‌లో కొన్న ఖరీఫ్ మిగులు ధాన్యం, రబీకి సంబంధించిన మరికొంత ధాన్యాన్ని కొని ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. అనంతరం మిల్లులకు ధాన్యం రవాణా చేశారు. గతంలో మాదిరిగానే ధాన్యం బిల్లులు 48 గంటల వ్యవధిలోనే జమ అవుతాయని రైతులు ఆశించారు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ 8 నుంచి ధాన్యం బకాయిలు పెండింగ్‌లోనే ఉండటంతో వారిలో ఆందోళన మొదలైంది. రూ.12 కోట్లకు పైగా ధాన్యం బిల్లులు 80 రోజులకు పైగా పెండింగ్‌లోనే ఉండటంతో, మిగతా 6లో..

హమాలీ చార్జీల సంగతేంటి?

ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ధాన్యం రవాణా, హమాలీ చార్జీలు పెండింగ్‌లోనే ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ వరికోతల సమయంలో వర్షాలు కురవడంతో ధాన్యం తడిచిపోతుందనే భయంతో ఇతర జిల్లాల్లోని మిల్లులకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని 60 వేల టన్నులకుపైగా ధాన్యం రవాణా చేశామని రైతులు చెబుతున్నారు. అయితే, ధాన్యం రవాణా బిల్లులు ఇంకా పూర్తి స్థాయిలో విడుదల చేయలేదంటున్నారు. ఇతర జిల్లాలకు రవాణా చేసిన ధాన్యం రవాణా బిల్లులతో పాటు జిల్లాలోని మిల్లులకు రవాణా చేసిన బిల్లులు, హమాలీ చార్జీలు కూడా ఇంకా విడుదల చేయలేదని చెబుతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన ధాన్యం బకాయిలు రూ.12 కోట్లు, హమాలీ, రవాణా బిల్లులు కూడా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

1,200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు చేసిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ అధినేత ఆదిత్య ఆ మొత్తాన్ని ఏం చేశాడు? దుబాయిలోని ట్రేడింగ్ కంపెనీ కబానాకు పంపించాడా? ఆ వివరాలేమీ బయట పడకుండా ముందే ల్యాప్‌టాప్‌లో డేటా డిలీట్ చేశాడా? ఈ ప్రశ్నలన్నింటికీ పోలీసులు అవుననే సమాధానం చెబుతున్నారు. ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టిన డబ్బంతా కబానాకు వెళ్లడం వెనుక కుట్రను ఛేదించే పనిలో పోలీసులు ఉండగా, ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టిన 'పెద్దవారి' జాబితా రోజురోజుకూ పెరిగిపోతోంది.

కబానా కహానీ

అద్విక డబ్బంతా దుబాయిలోని కబానా కంపెనీకి..

- ముందు జాగ్రత్తగా ఆదిత్య తెలివితేటలు
- కేసు నమోదుకు ముందే ల్యాప్‌టాప్ డేటా డిలీట్
- మొత్తం డేటాను రిట్రీవ్ చేసిన పోలీసులు
- కబానాకు నిధులు మళ్లించినట్టు గుర్తింపు
- వివరాల కోసం దుబాయి కంపెనీకి మెయిల్
- ఆదిత్య తమ్ముళ్ల కోసం హైదరాబాద్ వెళ్లిన కాప్స్
- బాధితుల జాబితాలో పెరుగుతున్న 'పెద్దవారు'
- తాజాగా ఓ పోలీసు ఉన్నతాధికారి పీఏ
- ఆయన డబ్బు రాబట్టేందుకు ఓ కానిస్టేబుల్ హడావిడి



ఆదిత్య

6

పులిగడ్డ అక్విడెక్ట్‌కు కొత్త సొబగులు!

- మరమ్మతులు, రంగులు

చొచ్చుకొస్తున్న ఉప్పునీరు

- కోడూరులో కష్టాలు

6

నేడు దుర్గమ్మకు భాగ్యనగర్ బంగారు బోనాలు

కలెక్టర్ కమ్ టీచర్

ప్రధానోపాధ్యాయులకు పాఠాలు బోధించిన కలెక్టర్ బాలాజీ



ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ బాలాజీ

- బోధన, పాఠశాలల నిర్వహణలో హెచ్‌ఎంల పాత్రపై దిశానిర్దేశం
- విద్యార్థుల సంఖ్య తగ్గడంపై ఆరా.. సమీక్షించాలని హితవు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : నిత్యం పరిపాలనాపరమైన విధులు, సమీక్షలు, సమావేశాలతో బిజీగా ఉండే కలెక్టర్ బాలాజీ టీచర్‌గా మారారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, బోధనలో సమూల మార్పులు తీసుకురావడం, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తనదైనశైలిలో ఉదాహరణలతో వివరించారు. కృష్ణా యూనివర్సిటీలో శనివారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు 'ఇంపాక్ట్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి టీచర్ బోధించే సబ్జెక్టును ప్రేమిస్తారని, కానీ సబ్జెక్టును ఎంతమేర అధ్యయనం చేస్తున్నారని, కాలక్రమంలో వస్తున్న మార్పులను గమనించి ఎంతమేర మార్పులు చేస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. మీ పూర్వ విద్యార్థులకు చెందిన పిల్లలు మళ్లీ మీ వద్దే చదువుతున్నారని, సిలబస్ మాత్రం పాతికేళ్లుగా మారడం లేదన్నారు. తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టులు బోధించే టీచర్లు భాషపై ప్రేమను పెంచుకుని బోధన సాగించాలన్నారు. లెక్కల సబ్జెక్టుతో పాటు రీజనింగ్, ఎన్‌ఎంఎస్‌ను ఎంతమంది బోధిస్తున్నారని ప్రశ్నించారు. పాఠ్యాంశాలను మరింత లోతుగా అధ్యయనం చేసి, ఇతర అంశాలను కూడా పిల్లలకు బోధించాలని చెప్పారు. మీతో పాటు పనిచేసే టీచర్ల కంటే సబ్జెక్టులో తమకెక్కువ తెలుసనే కిక్‌ను ఎందుకు పొందరని ప్రశ్నించారు.



సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోండి

నోబుల్ బహుమతి పొందిన సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని టీచర్లు విద్యార్థులకు పాఠాలు చెప్పాలని సూచించారు. మొవ్వ పాఠశాలలో పనిచేసే లెక్కల టీచర్ మేకా రాణి అక్కడి నుంచి బదిలీ అయితే లెక్కల ల్యాబ్ ఆ పాఠశాల నుంచి తరలిపోతుందని తాను గ్రహించానన్నారు. లెక్కలకు సంబంధించిన అన్ని సూత్రాలతో ఆమె ప్రత్యేక ల్యాబ్‌ను తయారు చేయడం తాను చూశానన్నారు. గుడివాడలో పనిచేస్తున్న శ్రీనివాసరావు అనే టీచర్ ఫిజిక్స్ విభాగంలో పాఠ్య పుస్తకాలు రాశారని, సొంత ఖర్చుతో వెబ్‌సైట్ రూపొందించారని చెప్పారు.

4,531 మంది విద్యార్థులు తగ్గారు

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 4,531 మంది విద్యార్థులు తగ్గారని, ప్రధానోపాధ్యాయలు తమ పరిధిలోని పాఠశాలల్లో పిల్లలు ఎందుకు తగ్గారో పరిశీలించాలని సూచించారు. రెండు నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు ఎందుకు తగ్గారో వివరాలు సేకరించి, వారు ప్రస్తుతం ఎక్కడ చదువుతున్నారో గమనించి, తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సోమవారం నుంచి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతుల్లో పిల్లల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ ఇంపాక్ట్ కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ వీసీ కూన రామ్‌జీ, మోటివేటర్లు గంపా నాగేశ్వర్, నండూరి సుబ్బారావు ప్రసంగించారు.

కొలిచిన వారికి కొంగు బంగారం

» దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణలు

ఇంద్రకీలాద్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ చేసి మొక్కులు తీర్చుకోవడానికి శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తబృందాలు తరలివచ్చాయి. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారికి స్వాగతం పలికారు. భక్త బృందాలకు ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్టు ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. సారె సమర్పణకు వచ్చే వారు దేవస్థానం టోల్‌ఫ్రీ నెంబరు 180042 59099లో నమోదు చేసుకుంటే, ఏర్పాట్లు సులభం అవుతాయని ఈవో తెలిపారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం మహామండపం భక్తులకు సామూహిక ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం అందజేశారు. సుమారు 46 భక్త బృందాలు విచ్చేసినట్టు అధికారులు తెలిపారు.



దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న భక్తబృందం

నేడు భాగ్యనగర్ బంగారు బోనాల సమర్పణ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆదివారం తెలంగాణ భాగ్యనగర్ బంగారు బోనం సమర్పణ జరగనుంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ అమ్మవారికి బంగారు బోనాలు సమర్పించటం జరుగుతోంది. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సోదరభావంతో ఉంటూ అభివృద్ధి బాటలో సాగాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా భాగ్యనగర్ మహంకాళి జాతర అమ్మవారి బోనాల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనాలను సమర్పిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 9 తర్వాత బోనాల భక్తబృందం జమ్మిదొడ్డిలో తొలుత పూజలు నిర్వహించి కళాబృందాలు, డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల నినాదాలు, పోతురాజుల విన్యాసాలతో దుర్గమ్మకు జేజేలు పలుకుతూ ఊరేగింపు బయలుదేరుతుంది. అనంతరం ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారు.



అమ్మవారికి బంగారు బోనాలు ఫైల్

దుర్గమ్మ దేవస్థానంలో యాగశాల అందుబాటులోకి తేవాలి



అధికారులు, అర్చకులతో కలిసి యాగశాల పనులు పరిశీలిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై హోమాది కార్యక్రమాల నిమిత్తం దాత సంగా నరసింహారావుచే నిర్మించిన యాగశాల త్వరగా భక్తులకు అందుబాటులోకి తేవాలని ఈవో శీనానాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఈఈ కోటేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్‌లతో కలిసి యాగశాల పనులు పరిశీలించారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో చండీ హోమం నిర్వహించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారని, ఢిల్లీ, ముంబయి ప్రాంతాల నుంచి కూడా ముందస్తుగా పూజా టిక్కెట్ బుక్ చేసుకుంటున్నారని ఈవో గుర్తుచేశారు. ప్రస్తుతం చండీ హోమం జరుగుతున్న ప్రదేశం చాలకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నందున కొత్త యాగశాల అందుబాటులోకి తేవాలని, ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేయాలన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ బస్సులు


బస్సుస్టేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అరుణాచల గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10 పౌర్ణమి సందర్భంగా 8వ తేదీ రాత్రి 8 గంటలకు విజయవాడలో బస్సు బయలుదేరి 9వ తేదీ ఉదయం కాళహస్తి దర్శనం, మధ్యాహ్నం కాణిపాకం, సాయంత్రం గోల్డెన్ టెంపుల్ సందర్శన, అనంతరం 10వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం అదేరోజు సాయంత్రం బయలుదేరి 11వ తేదీ ఉదయం 6గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో రానుపోను చార్జీ రూ.2,500లు అని తెలిపారు. ప్రతినెలా 30 రోజులు ముందుగానే పౌర్ణమినాడు అరుణాచలం వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పౌర్ణమి రోజునే కాకుండా 35 మంది ఒక బృందంగా కోరిన తేదీల్లో వారి నివాసాల వద్ద నుంచే బస్సులు నడపనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా గాని, సమీప బస్‌స్టేషన్‌లోగాని అధీకృత ఏజెంట్ల వద్ద గాని టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాల కోసం 8074298487, 7382898942 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.



దేవరపల్లి ఎస్సీ సొసైటీ సీ క్లాస్ భూములను పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో, మైనింగ్ ఏడీ తదితరులు

సొసైటీ భూములు పరిశీలించిన జేసీ, ఆర్డీవో

తోట్లవల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దేవరపల్లి లంకలో ఎస్సీ ఫీల్డు లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సీ క్లాస్ భూములను శనివారం జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ఆర్డీవో హేలాషారోన్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించింది. గతంలో మచిలీపట్నంకు చెందిన ఓ వ్యక్తి ఈ భూముల్లో బుసక, ఇసుక తవ్వకాలకు అర్జీ పెట్టగా అధికారులు సర్వేచేసి హద్దులు వేశారు. అయితే దీనిని వ్యతిరేకిస్తు సొసైటీ సభ్యులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఇసుక తవ్వకాలతో సొసైటీ భూములు కోతకు గురవుతాయని అభ్యంతరం తెలియజేయటంతో అనుమతి నిలిపివేశారు. ఇదిలా ఉండగా మైనింగ్ ఏడీ కొండారెడ్డి, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, నీటిపారుదల, వ్యవసాయ, భూగర్భజలశాఖల అధికారులతో జేసీ, ఆర్డీవో సొసైటీ భూములను పరిశీలించారు. ఇసుక, బుసక తవ్వకాలపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు తెలిసింది.



నూతన హంగులతో పులిగడ్డ అక్విడెక్ట్

పులిగడ్డ అక్విడెక్ట్‌కు కొత్త సొబగులు!

అవనిగడ్డ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దివిసీమకు సాగునీరందించే పులిగడ్డ అక్విడెక్ట్ కొత్త శోభను సంతరించుకుంది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో అక్విడెక్ట్ మరమ్మతులకు రూ.కోటి 5 లక్షలు నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో పులిగడ్డ అక్విడెక్ట్‌కు మరమ్మతులు నిర్వహించారు. దీంతోపాటు పంట కాలువలకు నీరు విడుదలయ్యే అక్విడెక్ట్‌కు సరికొత్త రంగులు వేయటంతో అక్విడెక్ట్ చూడముచ్చగా దర్శనమిస్తోంది.



కరకట్ట దాటి చొచ్చుకొస్తున్న ఉప్పునీరు

కోడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కోడూరు మండలం దిగువ ప్రాంతమైన బసవ వానిపాలెం, ఊటగుండం, పాలకాయితిప్ప గ్రామాల వద్ద సముద్రపు కరకట్ట దాటి ఉప్పునీరు చొచ్చుకు వస్తున్నది. కరకట్ట అవుట్ పాల్స్ స్లూయిస్‌లకు గేట్లు లేకపోవడంతో సముద్రపు పోటుకు ఉప్పునీరు కరకట్ట దాటి సాగు భూములను ముంచెత్తుతోంది. గతంలో కంటే ఈ ఏడాది అధిక పోట్లు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఉప్పునీటితో పంటలు పండక జీవనోపాధి కష్టమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగువ ప్రాంత రైతుల సమస్యలను గుర్తించి వెంటనే అవుట్‌పాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నేడు మచిలీపట్నంకు షర్మిల రాక

మచిలీపట్నంటౌన్ : ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి డీసీసీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి హాజరవుతారని మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ తెలిపారు. పార్టీ పటిష్టతకు తీసుకోవలసిన చర్యలపై షర్మిలరెడ్డి మాట్లాడతారన్నారు.

కబానా కహానీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 1,200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు చేసి ఝలక్ ఇచ్చిన అద్వికా ట్రేడింగ్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ అధినేత శ్రీవెంకట ఆదిత్య ఆ మొత్తాన్ని దుబాయిలో ఉన్న కబనా ట్రేడింగ్ కంపెనీకి మళ్లించాడని పోలీసులు గుర్తించారు. అంతే కాదు.. ఆ వివరాలను ల్యాప్‌టాప్‌లో లేకుండా చేశాడు. నష్టాలు రావడం మొదలై, ఏజెంట్ల నుంచి ఒత్తిడి పెరుగుతున్న సమయంలో కబనా పేరు కనిపించకుండా చేశాడు. ఈ ట్రేడింగ్ కంపెనీలోకి హవాలా మార్గంలో డబ్బును పంపినట్టు నిర్ధారించారు. అద్విక ట్రేడింగ్ కంపెనీ నుంచి ఇప్పటి వరకు ఏయే మార్గాల ద్వారా ఎంతెంత మొత్తంలో నిధులు కబనా ఖాతాల్లోకి వెళ్లాయో వివరాలు ఇవ్వాలని పోలీసులు ఆ కంపెనీకి మెయిల్ చేశారు. అవి వచ్చాక లెక్కలు ఏవిధంగా మారతాయో వేచి చూడాలి.

తెలంగాణకు చేరిన పోలీసులు

ఈ కేసు దర్యాప్తులో మొత్తం 50 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఆదిత్య ఇక్కడే కాకుండా తెలంగాణ నుంచి పెట్టుబడులను రప్పించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో ఆదిత్య ఇద్దరు తమ్ముళ్లు ఈ వ్యవహారాలను నడిపినట్టు భావిస్తున్నారు. వారికోసం ఒక బృందం అక్కడకు వెళ్లింది. ఏజెంట్లు, ఖాతాదారులను నమ్మించడానికి ఆదిత్య గోల్డ్‌లీఫ్ పేరుతో నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌ను తయారు చేయించాడు. అందులో రూ.120 కోట్లు తన పెట్టుబడిగా చూపించాడు. ఇదికాకుండా అద్వికలో ట్రేడింగ్ చేయడానికి స్టాక్ మార్కెట్‌లో అనుభవం ఉన్న మహిళను సలహాదారుడిగా నియమించుకున్నాడు. లబ్బీపేటలో ఉంటున్న ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆమెకు ఇప్పటి వరకు వేతనంగా రూ.2.50 కోట్లు చెల్లించినట్టు తెలిసింది.

కమీషన్ ఆశచూపి..

ఖాతాదారులతో ఎలాంటి సంబంధాలు లేకుండా ఏజెంట్ల వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న ఆదిత్య వారి ద్వారా పెట్టుబడులను రప్పించుకున్నాడు. ఎంత ఎక్కువ డిమాండ్ చేస్తే అంత మొత్తంలో కమీషన్లు ఇచ్చాడు. ఏజెంట్లు కొంత కమీషన్‌ను మినహాయించుకుని మిగిలిన దాన్ని ఖాతాదారులకు ఇచ్చేవారు. తొలినాళ్లలో కమీషన్ దండిగా అందడంతో ఖాతాదారులే ఏజెంట్ల అవతారమెత్తారు. 6 నుంచి 12 శాతం వరకు కమీషన్లు చెల్లించినట్టు తెలిసింది. వచ్చిన పెట్టుబడులు, ఇచ్చిన కమీషన్లకు సంబంధించిన మొత్తం వివరాలను ఆదిత్య ల్యాప్‌టాప్ నుంచి తొలగించేశాడు. అద్విక కార్యాలయంలో సోదాలు నిర్వహించిన పోలీసులు ల్యాప్‌టాప్, కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ల్యాప్‌టాప్‌లో ఎలాంటి డేటా కనిపించకపోవడంతో ప్రశ్నించే సరికి డిలీట్ మాట బయటకొచ్చింది. దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డేటాను రిట్రీవ్ చేశారు. ఆ సమయంలో ఆదిత్య అమ్మాయిలతో నగ్నంగా మాట్లాడిన దృశ్యాలు బయటపడ్డాయి.

బాధితుల్లో పోలీసు ఉన్నతాధికారి పీఏ

అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఓ పోలీసు ఉన్నతాధికారి సహాయకుడి పేరు బయటకొచ్చింది. ఆయన ఏకంగా రూ.35 లక్షలు పెట్టుబడి పెట్టినట్టుగా తెలిసింది. ఈ మొత్తాన్ని ఎలాగైనా వెనక్కి రప్పించుకోవాలని భావిస్తున్నారు. ఈ బాధ్యతను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ భుజాన వేసుకున్నాడు. ఆదిత్యను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి ఈ కానిస్టేబుల్ నిత్యం ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఆయా దర్యాప్తు బృందాల్లో ఉన్న సిబ్బందికి ఫోన్ చేస్తున్నాడు. ఓ ఉన్నతాధికారికి పీఏగా వ్యవహరించే వ్యక్తి డబ్బులు ఉన్నాయని, వాటిని ఎలాగైనా ఇప్పించాలని చెబుతున్నాడు. విజిలెన్స్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ లోగడ విజయవాడ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశాడు. కేసు దర్యాప్తు మొత్తం టాస్క్‌ఫోర్స్ అధికారుల కనుసన్నల్లో సాగుతున్నందున ఆ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు విరామం లేకుండా ఫోన్లు చేస్తున్నాడు. కాగా, ఉన్నతాధికారి వ్యక్తిగత సహాయకుడే కాకుండా ఈ కానిస్టేబుల్ కూడా పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. అద్వికలో అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. ఇప్పటికే నిఘా విభాగంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ పేరు బయటకు వచ్చింది. ఆయన తన బినామీ ద్వారా రూ.50 లక్షలు పెట్టించాడు.

ఇంద్ర వైభవం

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. దేవదాయ శాఖ ద్వారా ప్రాథమిక ప్రతిపాదన పంపగా, ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రెండో దశలో కేవలం నాలుగు ఇళ్లే భూ సేకరణలో ఉన్నాయి. గోసాల వద్ద రాజస్థాన్ స్కూల్‌తో పాటు అడపా రాములు మునిసిపల్ స్కూల్ ఉంది. ఇవి రెండూ అతిపెద్ద విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ రెంటినీ తొలగించాల్సి ఉంటుంది. అడపా రాములు మునిసిపల్ స్కూల్‌లో పిల్లలు లేకపోవటంతో మూసివేసే పరిస్థితి ఉంది. దీంతో ఈ స్కూల్ తొలగింపు విషయంలో ఇబ్బంది తలెత్తదు. కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తే సరిపోతుంది. కాగా, రాజస్థాన్ స్కూల్ నిర్వాహకులతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. వీరికి ప్రత్యామ్నాయంగా మరో చోట స్కూల్ నిర్వహించుకోవటానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలి. నాలుగు ఇళ్లే కాబట్టి రెవెన్యూ శాఖ ద్వారా సంప్రదింపులు జరపటం కష్టమైన పనికాదు. ఈ రెండు స్కూళ్ల భూములను తీసుకోగలిగితే, కనకదుర్గానగర్‌ను విస్తరించే అవకాశం తేలికే.



బదిలీల ప్రక్రియలో ఎస్పీ గంగాధరరావు

కొనసాగిన మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయం సమావేశపు హాలులో 2వ రోజుగా శనివారం మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన మహిళా పోలీసులు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. 530 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మ్యూచువల్, స్పౌజ్, దివ్యాంగుల కోటా, ఆరోగ్య సమస్య ప్రాతిపదికన బదిలీలు చేపడుతున్నామన్నారు.

సజ్జలవి పిచ్చి ప్రేలాపనలు

» దేవినేని ఉమా ఫైర్



గొల్లపూడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో జైల్లో పెడతామని సజ్జల రామకృష్ణారెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాడని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గొల్లపూడిలో మీడియా సమావేశంలో ఉమా మాట్లాడుతూ, వైసీపీ పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిందని, జగన్మోహన్ రెడ్డి బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సజ్జల సమర్థించుకుంటూ మాట్లాడుతున్నాడన్నారు. జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో సజ్జల, వై.వి.సుబ్బారెడ్డి, మాజీమంత్రులు, వైసీపీ దుర్మార్గులు కట్టుకథలు అల్లుతున్నారన్నారు. కంటైనర్లతో జగన్మోహన్ రెడ్డి దోచుకున్న వేలకోట్లు కక్కించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పోలీసుల ముందు దోషిగా నిలబడి జైలుకు వెళ్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వాస్తవాలకు సమాధానం చెప్పలేక కూటమి ప్రభుత్వంపై బురదజల్లి జగన్ రోత పత్రికలో అసత్యాలు, అబద్ధాలు వండివారుస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రాభివృద్ధి కోసం అమలు చేయాల్సిన ప్రణాళికలు, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

మద్యం మత్తులో ట్రావెల్స్ బస్సు డ్రైవర్

» బస్సు సీజ్.. డ్రైవర్‌పై కేసు నమోదు



డ్రైవర్ సత్యనారాయణ, మీటర్‌లో ఆల్కహాల్ శాతం

విజయవాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : ఫూటుగా మద్యం సేవించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. అతడి శరీరంలో మత్తు సాధారణ స్థాయిని మించి ఉండటంతో పోలీసులు కంగుతిన్నారు. ఓ ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు విజయవాడ నుంచి కుప్పం వెళుతోంది. బస్సుకు నెరుసు సత్యనారాయణ డ్రైవర్‌గా ఉన్నాడు. అతడు బెంజ్ సర్కిల్ వద్ద శనివారం 15మంది ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. నిబంధనల ప్రకారం ఎంజీ రోడ్డులోకి రాత్రి పదిగంటలు దాటిన తర్వాత మాత్రమే బస్సులు ప్రవేశించాలి. సత్యనారాయణ రాత్రి ఎనిమిది గంటలకే బస్సును ఎంజీ రోడ్డులోకి తీసుకొచ్చాడు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న 5వ ట్రాఫిక్ స్టేషన్ ఎస్‌ఐ సాగర్ సిబ్బందితో బస్సును ఆపి డ్రైవర్ సత్యనారాయణను ప్రశ్నిస్తుండగా మద్యం మత్తులో ఉండటంతో ఎస్‌ఐ బ్రీత్‌ఎనలైజర్‌ను ఊదించగా శరీరంలో 85.1 మిల్లీగ్రాముల మద్యం మత్తు ఉన్నట్టు తేలింది. వెంటనే బస్సును సీజ్ చేసి డ్రైవర్ సత్యనారాయణపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు.

పున్నయ్య స్థలాలు హాంఫట్

(5వ పేజీ తరువాయి)

భద్రాచలం రాములవారి గుడికి వెళ్లేవారికి, దుర్గగుడికి వచ్చేవారికి అన్నదానం చేయాలనే సదాశయంతో ఈ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆయన భార్య అన్నపూర్ణను ట్రస్టీగా నియమించారు. ఈ ట్రస్టుకు పశ్చిమ గోదావరి జిల్లా చాటపర్రు గ్రామ పరిధిలో 21 ఎకరాలు, కృష్ణాజిల్లా కేసరపల్లిలో ఏ5.95 సెంట్లు, వన్‌టౌన్ వడ్డేవారి వీధిలో 340 గజాల ఖాళీస్థలం, తవ్వావారి వీధిలో 768 గజాల పెంకుటిల్లుతో పాటు సీతారామపురం సెంటర్ సత్యసాయిబాబా మందిర్ రోడ్డులో 1,400 గజాల్లో పెంకుటిల్లు ఉంది. మరికొంతభాగం ఖాళీగా ఉంది. వీటిపై వచ్చే ఆదాయంతో బాటసారులకు అన్నదానం నిర్వహించాలి. అయితే, వీరికి సంతానం లేకపోవటంతో దత్తత కుమారుడికి ట్రస్ట్ బాధ్యతలు అప్పగించి వీలునామా రాశారు. కాలక్రమేణా 1967, అక్టోబరు 31న ఈ ట్రస్ట్ దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. 1992లో దేవదాయ శాఖ అధికారులు అన్నసత్రానికి ఈవోను నియమించారు. పున్నయ్య దంపతుల దత్తత కుమారుడు చనిపోవటంతో ఆ బాధ్యతలు అతని ఇద్దరి కుమారులు చూస్తున్నారు. ఇద్దరిలో పెద్దవాడైన పూర్ణచంద్రరావు ట్రస్టుకు ఈవోను నియమించటాన్ని వ్యతిరేకించగా, రెండో కుమారుడు హరినారాయణ ట్రస్ట్ దేవదాయ శాఖ ఈవో పరిధిలోనే ఉండాలని చెప్పడంతో ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. దీనిపై పూర్ణచంద్రరావు 1999లో జిల్లాకోర్టును ఆశ్రయించారు. పూర్ణచంద్రరావు అన్నసత్రం ట్రస్టీగా కొనసాగేందుకు కోర్టు అనుమతినిచ్చింది. దీనిపై దేవదాయ శాఖ అధికారులు 2005లో హైకోర్టును ఆశ్రయించగా, స్టేటస్కో ఇచ్చింది. నాటి నుంచి ఆ కేసు కోర్టులోనే పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో 2016లో ట్రస్టుకు చెందిన ఓ మహిళ సీతారామపురంలోని 1,400 గజాల స్థలంలో 600 గజాలను గాబ్రియేల్ అనే వ్యక్తికి విక్రయించింది. అతను ఆ మహిళకు ముందుగా రూ.10 లక్షలు అప్పు ఇచ్చి, ప్రామిసరీ నోట్లు, చెక్కులు తీసుకున్నట్లు, ఆమె సకాలంలో డబ్బు చెల్లించకపోవటంతో 600 గజాల స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. గాబ్రియేల్ ఆ స్థలాన్ని 2023లో వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తికి విక్రయించినట్లు, అతను ప్రస్తుతం మరొకరికి విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇంత వ్యవహారం జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్టుగా వ్యవహరిస్తుండటం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

చాటపర్రు స్థలం కూడా..

మరోవైపు ట్రస్టుకు సంబంధించిన పశ్చిమగోదావరి జిల్లా చాటపర్రు గ్రామ పరిధిలోని 21 ఎకరాలకు గానూ ఏ12.09 సెంట్లే మిగిలిందని అధికారులు చెబుతున్నారు. 2018లో నాటి ఈవో చాటపర్రు గ్రామంలో ఉన్న భూమిని పరిశీలించి 21 ఎకరం ఉన్నట్టు రిపోర్టులో రాశారు. మిగిలిన భూమి ఏమైందో దేవదాయ శాఖ అధికారులకే తెలియాలి. ప్రస్తుతం భూములకు కౌలు కూడా చెల్లించట్లేదనే ఆరోపణలు వస్తున్నాయి. బకాయిలు సుమారు రూ.2 కోట్ల వరకు ఉండొచ్చని తెలుస్తోంది.

ఆస్తులను కాపాడుతున్నాం

కూనాల పున్నయ్య అన్నసత్రం భూములను అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. అన్నసత్రం భూముల వివరాలను పైస్థాయి అధికారులకు తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

వై.సీతారామయ్య, కూనాల పున్నయ్య అన్నసత్రం ఈవో



రాఘవాపురం వద్ద ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కేంద్రీయ విద్యాలయాల అధికారులు

నందిగామలో కేవీ నిర్మాణానికి స్థల పరిశీలన

నందిగామ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం నిర్మాణం కోసం అనువైన భూమి కోసం అధికారులు అన్వేషణ చేపట్టారు. శనివారం కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ఆర్డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారిలు పల్లగిరి, రాఘవాపురం, హనుమంతుపాలెం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. సుమారు ఐదెకరాల భూమి అవసరం ఉందని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అధునాతన వసతులతో నలభై కోట్లతో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. రాఘవాపురం కొండ పక్కన ఉన్న భూమి నిర్మాణానికి అనుకూలంగా ఉందని ఆయన తెలిపారు. రెవెన్యూ అధికారులు భూమిని ఇస్తే తక్షణమే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ, త్వరలో నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని, ఆయన అనుమతితో సాధ్యమైనంత త్వరలో భూమిని కేటాయించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మునిసిపల్ ఏఈ ఫణికుమార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ, కత్తురోజు శ్రీనివాసాచారి, విజయవాడ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ నాగఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి రోప్‌వే

(5వ పేజీ తరువాయి)

భవానీ ఐల్యాండ్‌కు రెండోది. కానీ, ఈ ప్రతిపాదనలు పట్టాలెక్కలేదు. మొదటి ప్రతిపాదన ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ఉందని వైదిక కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. రెండో ప్రతిపాదనకు అలైన్‌మెంట్ అక్కన్న, మాదన్న గుహలపైగా వెళ్తుండటంతో ఆర్కియాలజీ శాఖ అభ్యంతరం తెలిపింది. ఈసారి మాత్రం దేవస్థాన అధికారులు ఎవరికీ అభ్యంతరం లేకుండా ఉండేలా సీతమ్మవారి పాదాల నుంచి ఓం టర్నింగ్ వరకు, తిరిగి ఓం టర్నింగ్ నుంచి భవానీ ద్వీపం వరకు రోప్‌వేను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు ఇటు వైదిక కమిటీ కానీ, అటు ఆర్కియాలజీ శాఖ నుంచి కానీ అభ్యంతరాలు వచ్చే అవకాశం లేదు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి ఇటీవల భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోప్‌వే ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది.



తానా సభలకు హాజరైన తంగిరాల సౌమ్యను సత్కరిస్తున్న ఎన్ఆర్ఐలు

తానా సభలకు సౌమ్య

నందిగామ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారు ఎక్కడ ఉన్నా అభివృద్ధి పథంలో నడవాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆకాంక్షించారు. తానా సభలకు హాజరయ్యేందుకు వాషింగ్టన్ డీసీ వెళ్లిన ఆమెకు ప్రవాస భారతీయులు, వారి తల్లిదండ్రులు ఆత్మీయ ఆతిథ్యం అందించారు. ఆమె తండ్రి తంగిరాల ప్రభాకరరావుతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, భాను ములుగూరి, రంజిత్ కోమటి తదితరులు సౌమ్యను సన్మానించారు.

ధాన్యం బకాయిలేవీ?

(5వ పేజీ తరువాయి)

ఎప్పటికి ఈ బిల్లులు ఇస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

వారంలో మంజూరు చేస్తాం..

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ధాన్యం బకాయిలు రూ.12 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులను మంజూరు చేయాలని ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారులకు లేఖ రాశాం. వారంలో ధాన్యం బిల్లులు విడుదలవుతాయి.

- శివప్రసాద్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న రామకృష్ణ, సీపీఐ నేతలు

అమెరికాది ఆధిపత్య, అహంకార ధోరణి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఘంటసాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్య, అహంకార ధోరణితో వ్యవహరిస్తున్న అమెరికా తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నది కమ్యూనిస్టు దేశాలేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గ సీపీఐ 25 మహాసభలు ఘంటసాల మండలం చినకళ్లేపల్లి గ్రామంలో శనివారం జరిగాయి. సభలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ, నేడు అంతర్జాతీయంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొందని, ట్రంప్ వ్యాఖ్యల వల్ల మూడో ప్రపంచయుద్ధం వస్తుందనే అనుమానం కలుగుతోందని తెలిపారు. చైనా, వియత్నాం, క్యూబా దేశాల్లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉందని, అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా అవి పని చేస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారతదేశం ఐక్యంగా సాగుతుందంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన లౌకిక రాజ్యాంగం వల్లే అన్నారు. 11 సంవత్సరాల మోదీ పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. తొలుత గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు మాలెంపాటి కాంచనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ రామారావు, కేవీవీ ప్రసాద్, నార్ల వెంకటేశ్వరరావు, అఫ్జల్, అడ్డాడ ప్రసాద్, చిన్నం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్‌చాలీసా

హనుమాన్‌జంక్షన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద శనివారం ఆషాడమాసం పురస్కరించుకొని వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా ఘనంగా నిర్వహించారు. వాసవి జాగృతి క్లబ్ అధ్యక్షుడు చామర్తి లోకనాథ్, కోశాధికారి ప్రసాద్, కార్యదర్శి రామకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు, పైడి సుధాకర్, చామర్తి రాంబాబు, కొనకళ్ల రాజశేఖర్, తవ్వా పూర్ణచంద్రరావు, బొమ్మిశెట్టి రామారావు, భగవతి పాల్గొన్నారు.



మైనర్లకు వాహనాలిస్తే జరిమానా

హనుమాన్‌జంక్షన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారి తల్లిదండ్రులకు జరిమాన విధిస్తామని ఎస్సై వి. సురేష్ హెచ్చరించారు. శనివారం స్థానిక సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. మోటార్ వాహన చట్టం నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన పలువురికి జరిమాన విధించారు. వాహన చోదకులు విధిగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని, హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రాధాన్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రూ. 35 లక్షలతో చేపట్టిన కోలవెన్ను శివారు కోమటిగుంట లాకు నుంచి తెన్నేరు వరకు రహదారి అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో సుమారు రూ.72 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ధన్నయ్య, వైస్ చైర్మన్ కళ్యాణి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, యార్లగడ్డ రాజా, సంగెపు రంగారావు, మొవ్వ నరేష్, తుమ్మల జగదీష్, ఏనుగ జయప్రకాష్, జనసేన పార్టీ నాయకులు పులి కామేశ్వరరావు, ముప్పా రాజా, నాని, పచ్చిపాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● నాట్లు సమయం కావడంతో ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న విద్యుత్‌ను ఉదయం ఆరు గంటల నుంచి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.



రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం ప్రజల మనిషిగా ఉంటా..

పెనమలూరు: బతికినంత కాలం ఎమ్మెల్యేగా ఉండాలని లేదని, ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం ప్రజల మనిషిగా..ప్రజలు ఆదరించే మనిషిగా ఉండాలని మాత్రమే తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం వెల్లడించారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పటికైనా గుర్తింపు వస్తుందని, అప్పటి వరకు నిస్వార్థంగా పార్టీకి సేవ చేయాలని ప్రతి కార్యకర్తను కోరారు. పార్టీ మండల పరిశీలకుడిగా నియమించబడ్డ ఎండీ ఇలియాస్ పాషాను ఇటీవల నియమితులయిన గ్రామ పార్టీ అధ్యక్షులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు జువ్వా రాంబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్ సంగెపు రంగారావు షేక్ బుజ్జి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



మాణిక్యమ్మతల్లికి ఘనంగా ఆషాఢసారె

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర మైన ఆషాఢమాసంలో గ్రామానికి మేలు జరిగేందుకు తమ ఇంటి ఆడప డుచుగా భావించి మాణిక్యమ్మతల్లికి ఆషాఢసారె సమర్పించడం ఆనవాయితీ అని మహిళలు తెలిపారు. అంపాపురంలోని మాణిక్యమ్మతల్లికి ఆషాఢ సారె సమర్పించారు.

సీఎం చంద్రబాబు స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు



గన్నవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పిఆర్‌కె ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ అన్నారు. మండలంలోని దావాజీగూడెం ఎస్సీ కాలనీలోని విద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్ బుక్స్‌ను శనివారం అందజేశారు. గన్నవరం సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఎంఈఎఫ్ నాయకులు దేవరపల్లి ఏసుబాబు, శేషుకుమార్, విక్టర్‌బాబు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 28 (ఆంధ్ర జ్యోతి) : ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను 24 గంటలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కానుమోలు 132కేవీ విద్యుత్ కేంద్రం వద్ద వీరవల్లి, తేలప్రోలు విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో రూ. 2.3కోట్ల వ్యయంతో నిర్మించే నూతన లైన్ల నిర్మాణానికి, మల్లవల్లి గ్రామానికి 24గంటల విద్యుత్ సరఫరాకు రూ.3.5కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యానంద్, డీఈ శ్రీనివాసరావు, ఏడీఈ శ్రీనివాసరావు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో సాగునీరు

రైతులకు సకాలంలో సాగునీరందే విధంగా సాగునీటి కాలువల మరమ్మతులు, ఆధునీకరణ పనులు పూర్తి చేయడం జరిగిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఏలూరు కాలువ నుంచి కాకులపాడు చానల్‌కు నీరు వదిలి పూజలు చేశారు. పూడికతీత పనులు సత్వరం పూర్తి చేసి రైతులకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, చలమల శెట్టి రమేష్ బాబు, దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయి కళ్యాణి, గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, మున్నంగి బాబూరావు, బేతాళ ప్రమీలా రాణి, యజ్జవరపు వెంకటరంగా రావు, కాటూరి విజయ భాస్కర్, చింతల వెంకట శివఅప్పారావు, చలసాని శ్రీనివాస్, దన్నే దుర్గారావు, మొవ్వా వెంకటేశ్వరరావు, పుట్టా సురేష్, మొవ్వా వేణుగోపాల్, బేతా శేషుకుమార్ పాల్గొన్నారు.



కానుమోలు విద్యుత్ కేంద్రం వద్ద లైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

● రంగయ్యప్పారావుపేట సాగునీటి కాలువలో పూడికతీయకపోవడం వల్ల గతంలో వచ్చిన భారీ వర్షాలకు ఇళ్లు కూడా ముంపు బారిన పడటంతో ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన శనివారం పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్నంగి శేషగిరిరావు, దోనె రాము, పరుచూరి రామకృష్ణ, కొత్తపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

గన్నవరం : ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. దావాజీగూడెం జడ్పీహైస్కూల్ విద్యార్థులకు పవర్ మేక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. దాతలు సజ్జా కిషోర్‌బాబు, లక్ష్మిలను అభినందించారు. సర్పంచ్ బడుగు బాలమ్మ, గొంది నరేంద్ర, సుకన్య, వాసిరెడ్డి శ్రీనివాసరావు, జవహర్ లాల్ నెహ్రూ, రాంబాబు, ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

రెల్లి కుటుంబాలకు మంచిరోజులు!

ఇళ్ల పట్టాల సమస్యను పరిశీలించిన జేసీ

కంకిపాడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పోరంబోకు స్థలాల్లో గత 40 ఏళ్లుగా నివాసముంటున్న రెల్లి కుటుంబాల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారమయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. తమకు ఇళ్ల పట్టాలు కేటాయించాలని కోరుతూ గత ఏడాది అక్టోబరు నెలలో పల్లె పండుగకు వచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను ఈ కుటుంబాలు కలిసి వేడుకున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో స్పందించిన స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రెల్లి కుటుంబాల ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని కంకిపాడు తహసీల్దార్ భవన్నారాయణను కోరారు. ఇదే సమయంలో 30, 40 గజాల పంచాయతీ పోరంబోకు స్థలాల్లో నివాసముంటున్న వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి ఓ జీవో 30 ఆయా కుటుంబాల పాలిట వరంగా మారింది. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చొరవతో కదిలిన ఫైలు జిల్లా కలెక్టర్ వరకు చేరింది. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్డీవో హెలా షారోన్, తహసీల్దార్ భవన్నారాయణతో కలిసి ఆయా కుటుంబాలు నివాసముంటున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. 30 గజాలు, 40 గజాల స్థలంలో ఇద్దరేసి, ముగ్గురేసి చిన్నారులతో కాపురం ఉంటున్న వారి వాస్తవ పరిస్థితులను గమనించారు. ఇటువంటి కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో సమస్యలేదంటూ చర్చించుకున్నారు. రానున్న కొన్ని రోజుల్లో వీరికి పట్టాల సమస్య పరిష్కారం అవుతుందన్న భరోసా అధికారుల నుంచి లభించటంతో ఆయా కుటుంబాల్లో ఆనందం నెలకొంది.



తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో హెలా షారోన్

పౌరులకు మెరుగైన సేవలే లక్ష్యం: డీఎస్పీ



పెనమలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం పెనమలూరు ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి కేటాయించిన ట్రాఫిక్ వాహనాలతో పౌరులకు మెరుగైన సేవలు అందించవచ్చని గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. శనివారం పెనమలూరు పోలీసులకు అందించిన నాలుగు ట్రాఫిక్ వాహనాలను పరిశీలించి సిబ్బందికి అందజేసి వారు మాట్లాడారు. ఈ వాహనాలను ఉపయోగించి పెనమలూరు ట్రాఫిక్ లిమిట్స్‌లో మెరుగైన ఎన్‌ఫోర్స్‌మెంటు చేయవచ్చని, రోడ్డుపై అనుకోని ప్రమాదం జరిగినప్పుడు బాధితుడు ఆసుపత్రికి వెళ్లేలోపు అవసరమైన ప్రథమ చికిత్స అందించవచ్చని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకొనేందుకు సహాయపడతాయన్నారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

గన్నవరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ ముగిసిందని ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్ తెలిపారు. శనివారం నాటికి 75 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారని తెలిపారు. తొలిసారి కళాశాలలో కౌన్సెలింగ్ ఏర్పాటు చేయటంపై విశేష స్పందన లభించిందని తెలిపారు.

రేపటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

ఉయ్యూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాల మహిళా సర్పంచ్‌లకు ఈ నెల 30నుంచి జూలై 2 వరకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. శిక్షణ తరగతులకు మహిళా సర్పంచ్‌లు హాజరుకావాలని తెలిపారు.

సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సింగన్నగూడెంలో పునర్నిర్మిస్తున్న సోమేశ్వర ఆలయానికి సోడిశెట్టి శోభనాద్రి విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులకు శనివారం రూ.30,151 విరాళాన్ని దాత అందజేశారు. అర్చకుడు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోడి శెట్టి శోభనాద్రి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొట్టే రాజా, ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, గాలి రాకాడరాజు, బత్తుల పాల్గొన్నారు.

లారీ యజమానుల సమస్యలు తీర్చాలని మంత్రికి వినతి



మంత్రి రాంప్రసాద్ రెడ్డికి తమ సమస్యలు వివరిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చిత్రంలో ఎంపీ చిన్ని

వన్‌టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డికి లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శనివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లారీ యజమానులు తమకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలను విన్నవించారు. క్రషర్ పరిశ్రమపై ఆధారపడి నడిచే లారీ వ్యాపారుల పరిస్థితులు, పెట్రోల్ ధరల పెరుగుదల వల్ల వ్యయ భారం, టోల్ గేట్ల వద్ద వేధింపులు, రోడ్డు గ్రాంట్లు ఆలస్యం, ఎ.టి.ఎస్. నెంబర్‌ల కారణంగా ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రవాణా రంగాభివృద్ధికి అవసరమైన విధానాలను రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైలర్ అసోసియేషన్ సెక్రటరీ సూరపనేని సురేష్, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ రావి శరత్, ఎ.సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

రాజమండ్రి కోర్టుకు మాజీ మంత్రి ఉమా



విజయవాడ లీగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు రాజమండ్రిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు శనివారం హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్రను అక్రమంగా అరెస్టు చేసిన సందర్భంలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న రవీంద్రను పరామర్శించేందుకు వెళ్లిన దేవినేని ఉమా, ఇతర నేతలపై పెట్టిన అక్రమ కేసు విచారణ నిమిత్తం ఆయన రాజమండ్రి కోర్టుకు హాజరయ్యారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- కేయూ ఉపకులపతి ఆచార్య కూన రామ్‌జీ



హెచ్‌ఎంల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ రామ్‌జీ

మచిలీపట్నం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కూన రాంజీ సూచించారు. కృష్ణా విశ్వవిద్యాలయం అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో కృష్ణాజిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసం, ప్రేరణ, నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును కేయు వీసీ కూన రాంజీ ప్రారంభించి ప్రసంగించారు. మారుతున్న ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలన్నారు. తోటి ఉపాధ్యాయులతోనే కాకుండా తల్లిదండ్రులు, విద్యార్థులను సమన్వయపరుస్తూ ప్రధానోపాధ్యాయుడు నాయకుడిగా ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజాన్ని తీర్చిదిద్దే ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లన్నారు. విద్యార్థుల శక్తిసామర్థ్యాలను తీర్చిదిద్దే అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. జపాన్, ఇజ్రాయెల్ లాంటి దేశాలు ఎదగడానికి ఆ దేశాల్లోని ఉపాధ్యాయులే కారణమన్నారు. తన బాల్యంలో ఉపాధ్యాయులు తనకు స్ఫూర్తినివ్వడం వల్లే తాను ఐఏఎస్ అధికారినయ్యానన్నారు. డీఈవో పి.వి.జె. రామారావు మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పరీక్షా ఫలితాలు 82 శాతం సాధించామని, 161 మంది విద్యార్థులు షైనింగ్ స్టార్స్‌గా నిలిచారన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో మరింత మంది షైనింగ్ స్టార్స్ కావాలన్నారు. రిజిస్ట్రార్ ఉష ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు, ఇంపాక్ట్ ఫౌండర్ జంపాని నాగేశ్వరరావు, నండూరి సుబ్బారావులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించే విధంగా ప్రధానోపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఈవోలు, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

9న సమ్మెను జయప్రద్రం చేయండి

- ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, చిత్రంలో నాయకులు

గాంధీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించాలని, తద్వారా దేశీయ రైతాంగానికి రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోలార్ తదితర పరిశ్రమల ఏర్పాటుకు పంట భూములను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. అనేక పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర లభించక అప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు, అఖిల భారత కిసాన్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, కిసాన్ సంఘటన రాష్ట్ర కన్వీనర్ మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడారు.

మత్తుమయం!

స్పిరిట్‌కు బానిసలవుతున్న యువత

- పెరిగిన స్పిరిట్, వైట్‌నర్, నిద్ర మాత్రల వాడకం
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ షాపుల్లో విపరీతంగా లభ్యం!
- మొక్కుబడిగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ
- మరణాలు సంభవిస్తున్నాయని విజిలెన్స్ కమిటీ సభ్యుల ఆందోళన



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మెడికల్ షాపుల్లో తక్కువ ధరకు మత్తు పదార్థాలు (స్పిరిట్, వైట్‌నర్, నిద్ర మాత్రలు) లభిస్తుండటంతో యువకులు వాటికి బానిసలవుతున్నారు. ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవడమే కాకుండా ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారు. సాధారణంగా స్పిరిట్‌ను ఆస్పత్రుల్లో ఆపరేషన్ సమయంలో రోగులకు ఇచ్చి ఆపరేషన్ చేస్తారు. అయితే అలాంటి స్పిరిట్‌ను ఫిజీషియన్ స్లిప్ లేకుండా నేరుగా మెడికల్ షాపుల్లో అమ్మకాలు చేయకూడదు. కానీ పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలోని మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వీటిని అమ్మడంతో యువత, యాచకులు, సాధువులు సులువుగా కొనుగోలు చేస్తున్నారు. అలాగే నిద్ర మాత్రలు సైతం ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మేస్తున్నారు. ఈరెండింటికి తోడు వైట్‌నర్ వాడే వారి శాతం సైతం అధికమయ్యింది. స్పిరిట్‌ను, వైట్‌నర్‌ను ఒక గుడ్డలో వేసి దాన్ని పీల్చడం ద్వారా వచ్చే మత్తులో యువత తేలియాడుతోంది. ఇది స్లో పాయిజన్‌గా లివర్, గుండె తదితర అవయువాలపై ప్రభావం చూపడం వల్ల కొద్ది రోజుల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారు. నిద్ర మాత్రలు సైతం ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మేయడం వల్ల ఎంత డోసు వాడలో తెలిక అనేక మంది మత్తులోకి పోయి చనిపోతున్నారు.

ఆస్పత్రుల్లో ఆపరేషన్ సమయంలో రోగులకు వినియోగించే స్పిరిట్ నేడు అంగట్లో సరుకుగా మారింది. అనధికార అమ్మకాలు జోరందుకున్నాయి. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలోని మెడికల్ షాపుల్లో విచ్చలవిడిగా లభిస్తున్నాయి. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే వినియోగదారులకు విక్రయించేస్తున్నారు. మత్తుకు అలవాటు పడిన యువకులు తక్కువ ధరకు లభించే స్పిరిట్‌ను కొనుగోలు చేస్తున్నారు. మత్తులో జోగటానికి నిద్రమాత్రలను మోతాదుకు మించి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని మందుల షాపుల్లో వైట్‌నర్స్ కూడా అందుబాటులో ఉంచి రహస్యంగా విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. డ్రగ్ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ తనిఖీలు లేకపోవటంతో స్పిరిట్, నిద్రమాత్రల విక్రయాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

లాభాపేక్షే ధ్యేయంగా మెడికల్ షాపు యజమానులు సాగిస్తున్న అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తున్నారని, దాడులు చేసిన విషయాన్ని కూడా గోప్యంగా ఉంచడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మెడికల్ షాపుల్లో ఇచ్చలవిడిగా స్పిరిట్, నిద్ర మాత్రల అమ్మకాలు జరుగుతున్నాయని, వీటి వల్ల యువకుల జీవితాలు నాశనం అవుతున్నాయనేందుకు పలువురు ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యులు ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం రోజున చేసిన వ్యాఖ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఎక్కువ సేపు నిద్రలో ఉండేందుకే..

ఆకలిని చంపేసుకునేందుకు, ఎక్కువ సమయం నిద్రలో ఉండేందుకు యాచకులు, సాధువులు, కొందరు యువత స్పిరిట్, నిద్రమాత్రలను ఎక్కువగా వాడుతున్నట్లు తెలుస్తోంది. యాచకులు, సాధువులు ఆకలిని చంపేసుకునేందుకు ఈ తరహా మత్తు పదార్థాలకు బానిసలవుతుంటే, యువత మాత్రం ఎక్కువ ఒత్తిడిని అధిగమించేందుకు వాడుతున్నట్టు సమాచారం. తల్లిదండ్రుల నిరాధరణకు గురైన వారు, ఒంటరిగా జీవించే యువత సైతం ఇలాంటివి ఎక్కువగా వాడుతున్నట్లు తెలిసింది. ఇవి వాడిన వారికి ఆకలి మందగించడం, ఎక్కువ సేపు మత్తులో జోగడం వంటివి ఉంటాయని వైద్యులంటున్నారు. మత్తులో ఉంటే సమయానికి ఆకలి అనిపించదని, ఎంత తింటారో ఎలా తింటారో వారికే తెలియదంటున్నారు. సమయానికి అలాంటి మత్తు పదార్థాలు అందకపోతే వాటికి ఎడిక్ట్ అయిన వారు విపరీతధోరణిలో చిత్ర విచిత్ర పనులు చేస్తారని వివరించారు.

దాడులు చేస్తున్నాం

జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మెడికల్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా స్పిరిట్, మత్తు బిల్లలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

-ఎ.సురేష్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఇబ్రహీంపట్నం

ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రతకు 'డివైన్ సురక్ష'

- నూతన ప్రాజెక్టును ఆవిష్కరించిన హోంమంత్రి వంగలపూడి అనిత
- అన్ని ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు సీసీ కెమెరాల ఏర్పాటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు, చిత్రంలో హోం మంత్రి అనిత, కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీనివాసరావు, సుజనా చౌదరి, రామ్మోహనరావు, బొండా ఉమా, శ్రీరాం తాతయ్య

విజయవాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రతకు ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు డివైన్ సురక్ష ప్రాజెక్టును ప్రారంభించారు. విజయవాడతోపాటు పట్టణాలు, గ్రామాల్లో సురక్ష 360 డిగ్రీల పేరుతో సీసీ కెమెరాలను దాతల సహకారంతో అందజేశారు. ఇప్పుడు డివైన్ సురక్షను పట్టాలెక్కించారు. ఈ ప్రాజెక్టును విజయవాడలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో హోంమంత్రి అనిత శనివారం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో సీసీ కెమెరాలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి రూ.30లక్షలను విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా డీజీపీ కార్యాలయం కమిషనరేట్‌కు అందజేసిన టీ-థర్డ్ డ్రోన్లను ప్రదర్శించారు. అదేవిధంగా త్వరలో అందుబాటులోకి రాబోయే సైబర్ కమాండో యాప్ పనితీరుపై ఏవీని ప్రదర్శించారు.

సాంకేతికతలో 'ఎన్టీఆర్'ది ముందు వరుస

- వంగలపూడి అనిత, హోంమంత్రి

సాంకేతికతను వినియోగించడంలో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ముందు వరుసలో ఉంది. నేరం జరిగినా, ట్రాఫిక్ స్తంభించినా సాంకేతికతను వినియోగిస్తున్నారు. అసాంఘిక శక్తుల అడ్డాలను డ్రోన్ల ద్వారా గుర్తిస్తున్నారు. అస్త్రం ఏఐ టూల్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్నారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత, భరోసా కల్పిస్తున్నాం. సురక్ష యాప్, సురక్ష డివైన్ ప్రాజెక్టు వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతుంది. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ, ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి.

ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రత కోసమే

- ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

కమిషనరేట్ పరిధిలో దేవాలయాలు, ప్రార్థనా మందిరిరాల భద్రత కోసం కొత్తగా డివైన్ సురక్ష ప్రాజెక్టును రూపొందించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదుల వల్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. వాటిని విజయవాడలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తాం.

త్వరలో సురక్ష స్కూల్, మార్కెట్ ప్రాజెక్టు రావాలి

- కేశినేని చిన్ని, ఎంపీ

ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రతకు డివైన్ సురక్ష, సురక్ష 360 ప్రాజెక్టులను ప్రారంభించడం అభినందనీయం. అలాగే సురక్ష స్కూల్, సురక్ష మార్కెట్ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలి. విజయవాడ ప్రజలకు సామాజిక అవగాహన ఎక్కువ. నగరవాసులు ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు సహకరిస్తూ జిల్లా అభివృద్ధికి సాయం చేయడం గొప్ప విషయం. రాజధానిలో భాగమైన కమిషనరేట్ పరిధిని నేర రహిత ప్రాంతంగా చేయడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోంది.

డిగ్రీ అర్హతతో ఎస్ఎస్‌సీలో ఉద్యోగాలు

జూలై 4 చివరి తేదీ ● కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ శాఖల్లో గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని కలెక్టర్ లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. 14,582 ఉద్యోగాలకు ఆగస్టు 13 నుంచి 30వ తేదీ వరకు ఎస్ఎస్‌సి బోర్డు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలకు డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు ఎస్ఎస్‌సీ. జీవోవీ.ఇన్ లేదా మై ఎస్ఎస్‌సీ మొబైల్ యాప్ ద్వారా జూలై 4వ తేదీ రాత్రి 11 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఆశా కార్యకర్తల నియామకాలు

- మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు
- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొంతమంది వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తూ మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నట్లు కలెక్టర్, తన దృష్టికి వచ్చిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వైద్యారోగ్య శాఖలో ఆశాకార్యకర్తల నియామకం కోసం ఈ నెల 25 నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులెవరూ మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మి, ప్రలోభాలకు లొంగవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే నియామక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. జిల్లా హెల్త్‌సొసైటీ ద్వారా మెరిట్ ఆధారంగా మాత్రమే నియామకాలు జరుగుతాయని వెల్లడించారు.

సింగయ్య కుటుంబానికి జగన్ రూ.2 కోట్లు చెల్లించాలి



- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు

గాంధీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల గ్రామ పర్యటనలో కారు కింద పడి మృతి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన సింగయ్య కుటుంబానికి రూ.2 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సింగయ్య మృతికి జగన్ నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల బెట్టింగ్‌లో ఓడిపోయి ఆత్మహత్య చేసుకున్న అగ్రకులానికి చెంది వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన జగన్, తనను చూడడానికి వచ్చి తనపై పూలు జల్లే క్రమంలో కారు కింద పడిన దళితుడైన సింగయ్య మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. జగన్‌కు దళితులంటే ఎంత చులకనో మరోసారి రుజువైందని మండిపడ్డారు. సింగయ్య కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

హ్యూమన్ రైట్స్ మిషన్ పేరుతో డబ్బు వసూలుకు యత్నం

- ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల్లేవని పెదపులిపాకలో దబాయింపు
- స్థానికులు నిలదీయడంతో పరారైన ఇద్దరు వ్యక్తులు



అక్రమ వసూళ్లకు యత్నించింది వీరే (వృత్తంలో)

పెనమలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): "మీ బిల్డింగ్‌కు పర్మిషన్ లేదు. మీ బిల్డింగ్ 50 గజాల కంటే ఎక్కువ స్థలంలో నిర్మించారు. కానీ ప్రభుత్వ అనుమతులు లేవు" అంటూ ఇద్దరు వ్యక్తులు పెదపులిపాకలోని కరకట్ట దిగువన ఎంవీఆర్ నగర్, శ్రీనగర్ కాలనీల్లో ఇళ్ల యజమానులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. కాసేపు భయపడ్డ స్థానికులు తర్వాత ఎవరు మీరు ఎక్కడి నుంచి వచ్చారు అని నిలదీయడంతో వారు తాము హ్యూమన్ రైట్స్ మిషన్ నుంచి వచ్చామని, ఇక్కడ భవనాలకు ఎవరు అనుమతులు ఇచ్చారంటూ దబాయించడంతో మీ ఐడీ కార్డులు చూపించమని స్థానికులు అడిగారు. దీంతో వారు తమ ఐడీ కార్డులు చూపించారు. వెంటనే స్థానికులు అసలు భవనాలతో మీకేంపని, పోలీసులను పిలుస్తాం అనడంతో వారు అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. వారి వద్ద ఉన్న ఐడీ కార్డులు, నోట్‌బుక్‌ను స్వాధీనం చేసుకొన్న స్థానికులు నోట్‌బుక్‌లో ఉన్న విషయాలను చూసి అవాక్కయ్యారు. ఐడీ కార్డుల్లో ఒక దాన్లో నల్లమోతు ప్రసన్న అని, మరొక దాంట్లో కొచ్చర్ల నిర్మల అని ఉంది. నోట్‌బుక్‌లో ఈ అయిదు నెలలు కేవలం అక్రమ భవనాలపైనే దృష్టి పెట్టి, ఒక్కొక్కరు పాతిక లక్షల రూపాయలు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది. ఎవరో తెరవెనుక వ్యక్తులు వీరిని వసూళ్లకు పంపినట్లు సమాచారం.

దోషరహిత ఓటర్ల జాబితా లక్ష్యం : డీఆర్‌వో



మాట్లాడుతున్న డీఆర్‌వో లక్ష్మీ నరసింహం

కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దోషరహిత ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయ పక్షాలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. కలెక్ట రేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్లో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఓటర్ల జాబితాలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను బీఎల్‌వోకు తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఫారం-8 నమోదు చేసి, సరిచేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. జిల్లాలో ఫారం 6, ఫారం 7, ఫారం 8 అర్జీలకు సంబంధించిన ప్రస్తుత వివరాలను తెలియజేసి సమాచారాన్ని రాజకీయ పక్షాలకు అందించారు. మరణించిన ఓటర్ల తొలగింపుపై అన్ని స్థాయిలలోనూ విచారణ చేయాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా, ఒకే డోరు నెంబరుతో నమోదై ఉన్న ఓటర్ల విషయంలోను ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రాజకీయ పక్షాల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల సెల్ డిప్యూటీ తహసిల్దార్ ఏఎస్ఆర్ గోపాలరెడ్డి, వై.రామయ్య (టీడీపీ), తరుణ్ కాకాని (బీజేపీ), బి.పుష్పరాజ్ (బీఎస్‌పీ), బొర్రా కిరణ్ (ఐఎన్‌సీ), ఎస్.అనిల్‌చంద్ (ఐఎన్‌సీ) పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు బాసటగా నిలవండి

ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్‌కు కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి

కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు సాధించిన ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ), పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన వినూత్న పీ 4 విధానం అమల్లోనూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. 'అమ్మ' ప్రతినిధులు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమయ్యారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి ఉన్నత విద్య అభ్యసించేందుకు అసోసియేషన్ కృషి చేస్తోందని తెలిపారు. ఏటా దాదాపు 450 మందికి రూ.18 లక్షల ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు వివరించారు. మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను దత్తత తీసుకొని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు వంటి వాటిని అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ నగరంలో ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అమ్మ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పీ 4 (ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజలు భాగస్వామ్యం) విధానాన్ని తీసుకొచ్చిందని, పేదలను అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు ఆయా కుటుంబాలకు సరైన మార్గనిర్దేశనం అవసరమని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాకారానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి అమ్మ అసోసియేషన్ చేయి కలపాలని, పేదరిక నిర్మూలనకు చేయూతనివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సమావేశంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, ప్రస్తుత అధ్యక్షులు గారపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పర్యావరణ హిత నవ్య పరిశ్రమలకు ప్రోత్సాహం

కృష్ణలంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచానికి ప్లాస్టిక్ కాలుష్యం పెనుసవాలుగా మారిన ప్రస్తుత పరిస్థితు ల్లో పర్యావరణ హిత నవ్య పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యా మ్నాయ ఉత్పత్తుల తయారీలో ముఖ్యంగా యువత, మహి ళలు కొత్త పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగొచ్చని చెప్పారు. ఈ విషయంపై సమన్వయ శాఖలు అవగాహన కల్పించడంతో పాటు ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ప్లాస్టిక్ ఇయర్‌బడ్స్, క్యాండీస్టిక్స్, పాలీస్టరిన్ (థర్మోకోల్) వస్తువులు వంటి నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే చెక్క స్పూన్‌లు, గుడ్డ సంచులు, కంపోస్టబుల్ ప్లాస్టిక్ ఉత్పత్తులు తదితరాలను పరిశీలించారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● మహిళా సర్పంచ్‌ల సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు

గుడివాడ రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహిళా సర్పంచ్‌లు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల మహిళా సర్పంచ్‌లకు నిర్వహించిన అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా సర్పంచ్‌లు భర్తల చాటు సర్పంచ్‌లుగా కాకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ముందుండాలని సూచించారు. కోడూరు ఎంపీడీవో సుధా ప్రవీణ్, ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవో బి.అశోక్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

గుడివాడ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం గ్రామస్థులందరి బాధ్యత అని కల్వపూడి అగ్రహారం సర్పంచ్ పోటూరి వెంకటేశ్వరమ్మ అన్నారు. గ్రామంలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి అవ్వమ్మ, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా గ్రూపు మహిళలు ర్యాలీ తీశారు.

వృద్ధులకు చీరల పంపిణీ

గుడివాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేయడం అభినందనీయమని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కే) అన్నారు. శనివారం మందపాడులోని నిరాశ్రయుల వసతిగృహంలో కుంభం రవికుమార్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

చినుకు పడితే చీకటే!

● విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పోలుకొండవాసుల వేడుకోలు

(ఆంధ్రజ్యోతి-నందివాడ)

కొద్దిపాటి వర్షం, గాలి వస్తే చాలు గ్రామంలో చీకటే అంటూ పోలుకొండ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా గ్రామంలో పంచాయతీ వీధి దీపాలు వెలగటం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కొత్త లైన్లు వేయడం, తీగలు లూజుగా బిగించటంతో గాలి వచ్చినప్పుడల్లా లెవన్ కేవీ వైర్లు ఇళ్లకు వచ్చే వైర్లకు తగిలి(ఎల్టీ వైర్లు) షార్ట్ సర్క్యూట్ అవుతోందని, వీధి దీపాలతోపాటు ఇళ్లల్లోని కరెంట్ కూడా పోతోందని గ్రామస్థులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితేనో, లేక స్తంభాలు పడిపోతేనో పనులు చేపడుతున్నారని, ముందుగా పనులు నిర్వహించటం లేదని అంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పంచాయతీ వీధి దీపాలు వెలిగే విధంగా చూడాలని, లూజుగా ఉన్న వైర్లు బిగించాలని కోరుతున్నారు.

రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

సమస్య నా దృష్టికి వచ్చింది. వర్షం వల్ల పనులు చేయలేదు. రెండు రోజుల్లో వైర్లు బిగిస్తాం.

- ఏడీ బాపిరాజు



పోలుకొండ ఎస్సీ కాలనీ కాలువ వద్ద సమానంగా ఉన్న 11 కేవీ వైర్లు, వీధి లైట్లు, వైర్లు

పోయిన చోట కొత్త లైట్లు వేస్తున్నాం

11 కేవీ వైర్లు పంచాయతీ లైను వైర్లకు తగలటంతో ఒకేసారి 40 లైట్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు టైట్‌గా బిగిస్తే లైట్లు వేయటం కుదురుతుంది.

- పంచాయతీ సెక్రటరీ విమల కుమారి

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కూచిపూడి : నిడుమోలు పంచాయతీ పరిధిలోని నిడుమోలు, వీరాయి లంక గ్రామాల్లో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి వేయాలని గ్రామస్థులతోపాటు సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. దీనిపై అనేక పర్యాయాలు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ఈదురుగాలులకు స్తంభాలు విరిగిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పలుచోట్ల విద్యుత్ వైర్లు వేలాడుతూ చేతికందేంత ఎత్తులో ఉన్నాయని తెలిపారు.



టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఈడే నానిని సత్కరిస్తున్న కూటమి నేతలు

టీడీపీ పామర్రు మండల అధ్యక్షుడిగా కుదరవల్లి

పామర్రు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా నిమ్మకూరుకు చెందిన కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, కార్యదర్శిగా ఈడే ఫకీర్(నాని) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు కోట వీరబాబు, శాయన పుష్పావతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీల్లో యువతకు అధిక ప్రాధాన్యత కల్పించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని కోటవీరబాబు, శాయన పుష్పవతి అన్నారు. తనపట్ల ఎంతో నమ్మకం ఉంచి మరోసారి మండల అధ్యక్షుడిగా ఎంపికయ్యేందుకు సహకరించిన మండలంలోని అన్ని గ్రామ పార్టీల అధ్యక్షులు, నాయకులకు, నియోజకవర్గ పెద్దలకు ప్రవీణ్‌చంద్ర కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన శక్తి వంచనలేకుండా కృషిచేస్తానన్నారు. ప్రవీణ్‌చంద్ర, నానీని పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాసు, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, సీనియర్ నేతలు మండపాక శంకర్‌బాబు, కోమరవోలు మాజీ సర్పంచ్ కాకరాల హరిబాబు, వీరంకి మోహనరావు, వేంకటేశ్వరరావు, జన్ను శోభన్‌బాబు, కోటి పాండురంగారావు, ఉప్పాలపాటి రాజా, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ముందుకు రండి

● దాతలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు

గుడివాడ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. శనివారం లింగవరం గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ఆయన ప్రారంభించారు. తర్వాత సాగునీటి పంటకాలువలను పరిశీలించారు. 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. పీ4 ప్రోగ్రామ్‌లో ప్రవాస ఆంధ్రులు, దాతలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు చెరుకూరి జగన్మోహనరావు, గాదిరెడ్డి చిరంజీవి రెడ్డి, మండపాటి గోపాలస్వామి, కొత్తకోట వెంకట శివనాగరాజు, పెనుగోలు శ్రీనివాసరావు, గాదిరెడ్డి చిన్నబాబు, మార్కు రాజు, కలపాల మాణిక్యాలరావు, కాటూరి ఏసుపాదం, పంచాయతీ కార్యదర్శి అనుల పాల్గొన్నారు.



లింగవరంలో తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజ ఉన్నతి

గుడివాడ : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వారి కాళ్లపై నిలబడితేనే సమాజమూ ప్రగతి సాధిస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం మున్సిపల్ సమావేశ మందిరంలో పట్టణ పరిధిలోని మెప్మా ఆర్పీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలోని 89 మంది ఆర్పీలకు ఒక్కొక్కరికి రూ.33వేలు విలువ గల ట్యాబ్‌లను అందజేశారు. ఏటా ఉత్తమ డ్వాక్రా సంఘానికి వ్యక్తిగతంగా రూ.5 లక్షల ప్రోత్సాహక నగదు అందిస్తానని మాట ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు రాంబాబు, లింగం ప్రసాద్, సత్యనారాయణ, చేకూరు జగన్మోహనరావు, మున్సిపల్ అధికారులు, మెప్మా సి.ఎం.ఎం బసవేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా బూరగడ్డ

టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడిగా మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ నియమితులయ్యారు. శనివారం ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. వేదవ్యాస్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. నియోజకవర్గ పరిశీలకురాలు నూకాలమ్మ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మజ్జి శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

దశాబ్దాల మురుగు సమస్యకు పరిష్కారం



పూడికతీత పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గుడివాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా రైతులకు సమస్యాత్మకంగా మారిన మల్లాయిపాలెం మైనర్ డ్రెయిన్ పూడికతీత పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అందిస్తున్న సహకారం మరువలేనిదని మార్కెట్ యార్డు డైరెక్టర్ రషీద్‌బేగ్ అన్నారు. శనివారం మల్లాయిపాలెం పరిధిలోని కల్వరి టెంపుల్ వద్ద డ్రెయిన్ పూడికతీత పనులను టీడీపీ గ్రామ ఇన్‌చార్జ్ మహ్మమద్ ఇషాక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మురుగుకాలువ సమస్యను ఎన్నిసార్లు అప్పటి ఎమ్మెల్యే కొడాలి నాని దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రషీద్‌బేగ్ అన్నారు. పంట నీటమునిగి రైతు కష్టాల్లో ఉంటే కొడాలి నాని అసలు ఎక్కడా పంటనష్టం జరగలేదని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. డ్రెయిన్ పూడికతీతపై రైతులు ఎమ్మెల్యే వెనిగండ్లకు కృతజ్ఞతలు తెలిపారు. నూర్ అహ్మద్, రైతులు నజీర్, హుసేన్ బేగ్, అబ్దుల్ రహ్మాన్, యాహియా, ఖాదర్ పాల్గొన్నారు.



అంగన్వాడీల ధర్నా, ర్యాలీ

గుడ్లవల్లేరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం నెలకు రూ.26000 ఇవ్వాలని మండలంలో అంగన్వాడీలు శనివారం పలు సెక్టార్లలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు సెక్టార్‌లో అంగలూరులో ధర్నా, కౌతవరం సెక్టార్‌లో కౌతవరంలో ర్యాలీ, డోకిపర్రు సెక్టార్ డోకిపర్రులో ధర్నా నిర్వహించారు. జూలై 9 వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ధర్నాల్లో పాల్గొన్న సీఐటీయూ మండల అధ్యక్షురాలు మేకల జయలక్ష్మి పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు బంద్‌కు పిలుపునిచ్చారు. అమ్మాజీ, మౌనిక గ్రేస్, నాగరాజకుమారి, భవాని పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

గుడివాడ : జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనశ్రీ పిలుపునిచ్చారు. శనివారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో పట్టణ కమిటీ సమావేశంలో ధనశ్రీ మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షురాలు సరోజ, భవాని, ఆదిలక్ష్మి, ప్రసన్న, హేమ, రాణి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పుపై అభ్యంతరాలు తెలపండి



పామర్రు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని రాజకీయ నేతలు, ఓటర్లకు పామర్రు నియోజకవర్గ ఎన్నికల ఎలక్ట్రోరల్ అధికారి జి.రమేష్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నూతన ఓటర్ల నమోదుపై అధికారులతో ఆయన చర్చించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. అర్హతగల యువత ఓటు హక్కు కోసం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విభాగం కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రవికాంత్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్, అనన్య, గణేష్, బీఎల్వోలు పాల్గొన్నారు.

వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రమేష్‌బాబు

పెదపారుపూడి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భూషణగుళ్ల గ్రామానికి చెందిన అలా రమేష్‌బాబు వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వీసురోడ్డులో గుంతలకు మోక్షం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



పమిడిముక్కల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాడంకి గ్రామపరిధిలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో గుంతలను ఎన్ హెచ్ అధికారులు పూడుస్తున్నారు. తాడంకి అండర్ పాస్ సమీపాన సర్వీసురోడ్డులో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేపట్టడం పట్ల పలువురు సంతోషం వ్యక్తంచేశారు.



జీవాలకు నట్టల నివారణ మందు

గుడివాడ రూరల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా ఉచితంగా నట్టల నివారణ మందులు వేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం డీడీ పర్యవేక్షణలో శేరిగొల్వేపల్లిలో 640 గొర్రెలకు, 230 మేకలకు మందు వేశారు. మోటూరు పశుసంవర్ధక శాఖ డాక్టర్ ఉన్నం హనుమంతరావు, మాజీ సర్పంచ్ మెరుగుమాల బసవపున్నయ్య, టీడీపీ నాయకుడు కాటూరి శివాజీ, గొల్వేపల్లి గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

కూచిపూడి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా కూచిపూడి గుర్తింపు పొందిన సందర్భంగా ఆరుగురు పారిశుధ్య కార్మికులను సర్పంచ్ కె.విజయలక్ష్మి నేతృత్వంలో పాలకమండలి సభ్యులు సత్కరించారు. సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, అమర బాలేశ్వరరావు, కార్యదర్శి కె.పుష్పనాథం, విశ్రాంత ఈవోపీఆర్డీ మద్దాల జయరాం పాల్గొన్నారు.

జనార్దనపురంలో పనుల పరిశీలన

నందివాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జనార్దనపురం గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో మల్లేశ్వరి శనివారం పరిశీలించారు. ఉషోదయ స్కూల్ వద్ద నిలిచిన వర్షపు నీటిని డ్రెయినేజీలోకి మళ్లించారు. రోడ్డు ఆక్రమణలకు గురి కావటం వల్ల వర్షపు నీరు వెళ్లటానికి అవకాశం లేకపోవటంతో రోడ్డు ఆక్రమణలు చేసిన వారికి నోటీసులు జారీ చేసి వెంటనే ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి సందీప్‌కు సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో అమీర్ మీర్జాబాషా, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఐదేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలల్లో చేర్చాలి

పామర్రు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న ఐదేళ్లు నిండిన చిన్నారులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సీఆర్పీలు, అంగన్వాడీ సిబ్బందికి ఎంఈవో జి.పద్మవాణి సూచించారు. విద్యావనరుల కేంద్రంలో ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. జీరో నమోదు ఉన్న పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు సమీపంలోని అంగన్వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లు నిండిన చిన్నారులందరినీ ప్రభుత్వ బడుల్లో నమోదయ్యేలా కృషిచేయాలన్నారు.

జూనియర్ అసిస్టెంట్ రత్నాకర్ మృతికి సంతాపం

గుడివాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పామర్రు మండలంలోని శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడివాడ ఐటీఐ కళాశాల జూనియర్ అసిస్టెంట్ కొసనం రత్నాకర్ మృతిచెందారు. రత్నాకర్ మృతికి ఎన్జీవోస్ అసోసియేషన్ గుడివాడ తాలుకా యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పి.రావు, జి.రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి కంచర్ల మహేష్, ఉపాధ్యక్షురాలు నిర్మల ఫ్లోరెన్స్, అసోసియేట్ సభ్యులు సంతాపం తెలిపారు.

ఘనంగా గణాంక దినోత్సవం

గుడివాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఆర్ కళాశాలలో జాతీయ గణాంక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అవగాహన కలిగించారు. దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు చేయడంలో గణాంకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ అన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

పమిడిముక్కల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ అమలుచేస్తామన్న కూటమి ప్రభుత్వం ప్రజలు దగాచేయడంలో తమకు తామే సాటి అని నిరూపించుకుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్‌చైర్మన్ బాణావత్ భుజంగనాయక్ విమర్శించారు. పమిడిముక్కలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై 2 నుంచి ఇది మంచి ప్రభుత్వమని ఇంటింటికి తిరిగి ప్రజలకు చెబుతామని కూటమి ప్రభుత్వం ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560	

రేపు మునిసిపల్ సమావేశం

పెడన, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. అజెండాలోని 13 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు.

3న కేంద్ర బృందం పర్యటన

పెడన, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామాలుగా ఎంపికయిన మడక, నందమూరు గ్రామాల్లో జూలై 3న కేంద్ర బృందం పర్యటించనుందని ఎండీవో ఎ.అరుణకుమారి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నందమూరులో ఫారెస్టు నర్సరీ, మినీ గోకులాలను సందర్శిస్తుందన్నారు. అనంతరం మడక గ్రామంలో హార్టీకల్చర్‌ను పరిశీలిస్తుందని తెలిపారు.

రూ.120 కోట్లతో నగర అభివృద్ధి

● కార్యాచరణ ప్రణాళిక సిద్ధం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరాన్ని రూ.120 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని, అందులో భాగంగా మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మునిసిపల్ కార్యాలయం పక్కన రూ.35 లక్షలతో నిర్మిస్తున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వెనక్కి వెళ్లిన కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం నిధులు రూ.73 కోట్లు మళ్లీ తీసుకొచ్చామన్నారు. జడ్పీ సెంటర్‌లో ఆక్రమణలు తొలగించి ఆ ప్రాంతంలో రూ.2 కోట్ల 75 లక్షలతో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు డంపింగ్ యార్డులోని చెత్తాచెదారాన్ని రూ.2 కోట్ల 25 లక్షలు ఖర్చు చేసి, కాంపాక్టర్లను తెప్పించి గుంటూరుకు తరలిస్తున్నామన్నారు. రానున్న అక్టోబరు 2వ తేదీ నాటికి డంపింగ్ యార్డును సుందరమైన పార్కుగా తీర్చిదిద్దుతామన్నారు. మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు, నగర సుందరీకరణకు రూ.165 కోట్లు అవసరమని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఓడరేవు రహదారి వెడల్పు పనులు చేపడుతున్నామన్నారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి భూమి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోనేరుసెంటర్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు తోట నరసయ్య విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, కమిషనర్ బాపిరాజు, కార్పొరేటర్ సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పార్టీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

2 నుంచి ప్రజల వద్దకు వెళ్లండి

● టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జూలై 2 నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ఏడాది పాటు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. శనివారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో నిర్వహించిన విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశీలకుడు లుక్కా సాయిరామ్ గౌడ్, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనిల్‌కుమార్, పిప్పళ్ల కాంతారావు, తెలుగు మహిళలు కరెడ్ల సుశీల, పాలపర్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయండి

● టీడీపీ నేతలతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో పార్టీ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ నేతలకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. శనివారం తోటమూలలోని పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల పరిశీలకులు, మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలాల్లోని ప్రతి గ్రామానికి వెళ్లి పార్టీ నాయకుల ఆమోదంతో కమిటీలను పూర్తి చేసి పార్టీ కేంద్ర కమిటీకి పంపాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా కమిటీల నియామకం జరగాలని సంస్థాగత ఎన్నికల నియోజకవర్గ పరిశీలకుడు గోపు సత్యనారాయణ సూచించారు. నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు, బొడ్డు వేణుగోపాలరావు, యక్కల శ్యామలయ్య, శలపాటి ప్రసాద్, పోతన స్వామి, కూనపరెడ్డి వీరబాబు, వడుగు తులసీరావు పాల్గొన్నారు.

చింతగుంటపాలెంలో గుర్తుతెలియని మృతదేహం



మచిలీపట్నం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చింతగుంటపాలెం వాటర్ ట్యాంకు వద్ద 60 ఏళ్ల వయసు గల వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వివరాలు తెలియలేదని, మాసిన గడ్డం, తెల్ల బనియన్ దేహంపై ఉన్నాయని, ఆ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 9440796414కు తెలియజేయాలని ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు తెలిపారు.

5న లోక్ అదాలత్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న 6వ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి

అవనిగడ్డ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోలీసులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులకు 6వ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి సూచించారు. శనివారం అవనిగడ్డ 6వ అదనపు జడ్జి బెంచ్‌పై లోక్ అదాలత్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. రాజీ పడదగ్గ కేసుల్లో కక్షిదారులను ఒప్పించి సాధ్యమైనంతవరకు రాజీ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.స్వర్ణలత పాల్గొన్నారు.

22ఏ ఇళ్ల స్థలాల పరిశీలన



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

అవనిగడ్డ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రాంతంలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న ఇళ్ల స్థలాలను జేసీ గీతాంజలి శర్మ శనివారం పరిశీలించారు. మండలంలో ప్రభుత్వ భూములుగా 22ఏ కింద నమోదై ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించి మొత్తం 80 దరఖాస్తులు రాగా, శనివారం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుతో కలిసి జేసీ 8 ఇళ్లను పరిశీలించారు. 2019కి ముందు తమ స్వాధీనంలో ఉండి 150 చదరపు గజాల లోపు ఉన్న ఇళ్లను ఉచితంగా రెగ్యులర్ చేసుకునేందుకు ప్రభుత్వం జీవో నెంబర్ 31ని జారీ చేసిందని, 150 గజాల కంటే ఎక్కువ భూమి రెగ్యులర్ చేసుకోవాలంటే మార్కెట్ రుసుమును లబ్ధిదారులు చెల్లించాలని ఆమె సూచించారు. తన లాగిన్‌కు వచ్చిన 8 ఇళ్లకు వెళ్లి ఆమె రికార్డులను పరిశీలించారు.

కమిషనర్‌పై వైసీపీ కార్పొరేటర్ల ఆరోపణలు అవాస్తవం

● మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్

మచిలీపట్నం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్‌పై వైసీపీ కార్పొరేటర్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. శనివారం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనే బాపిరాజు కమిషనర్‌గా వచ్చారన్నారు. అప్పట్లో బాపిరాజును మెచ్చుకుని సన్మానాలు చేసి, ఇప్పుడు నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు చేయడం ఎంత వరకు సబబన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరాభివృద్ధికి కౌన్సిల్‌లో పాలకవర్గంగా ఉన్న వైసీపీ సహకరించడం లేదన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా కమిషనర్ అత్యవసర పనులు చేయిస్తున్నారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ సూచనలు సలహాల మేరకే విధులు నిర్వహిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లుగా ఫిల్టర్‌బెడ్లను శుభ్రం చేయలేదని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించలేదని అన్నారు. డ్రెయిన్లలో సిల్టును తొలగిస్తున్నామన్నారు. ప్రతి రూపాయికి కార్పొరేషన్‌లో లెక్కలు ఉన్నాయన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్, కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

11 సీట్లకే పరిమితమైనా నోటి దురుసు తగ్గలేదు

● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణను విమర్శించే నైతిక హక్కు వైసీపీకి ఉందా: జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు

మచిలీపట్నం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినప్పటికీ ఆ పార్టీ నాయకులకు ఇంకా నోటి దురుసుతనం పోలేదని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణను విమర్శించే నైతిక హక్కు వారికి లేదని జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు అన్నారు. శనివారం జనసేన నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌ను ఊసరవెల్లి అని, బండి రామకృష్ణకు నియోజకవర్గస్థాయి లేదంటూ వైసీపీ నాయకులు చేసిన విమర్శలపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

విద్యార్థినికి రావెళ్ల ట్రస్ట్ ప్రోత్సాహం

చల్లపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చల్లపల్లికి చెందిన బైక్ మెకానిక్ బాషా కుమార్తె సయ్యద్ సనా ఫాతిమా ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి 571 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్‌మీడియట్‌లో ఫ్రీ సీటును సాధించింది. పేదకుటుంబం కావడంతో ఆమెకు రావెళ్ల కృష్ణసేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ సైకిల్, పుస్తకాలను వితరణగా అందజేశారు. ఉపసర్పంచ్ ముమ్మనేని నాని కుమారుడు సన్నీ యూనిఫాంను అందజేశారు.



పులిగడ్డలో నాగశ్రీను కుటుంబానికి రూ.50 వేలు అందిస్తున్న టీడీపీ నియోజకవర్గ నేత బొబ్బా గోవర్ధన్, పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

అవనిగడ్డ/చల్లపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మృతిచెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ నియోజకవర్గ నేత బొబ్బా గోవర్ధన్ రూ.75వేల ఆర్థిక సాయమందించారు. పులిగడ్డలో రెండు రోజుల క్రితం మృతి చెందిన కార్యకర్త బొర్రా నాగ శ్రీను కుటుంబానికి రూ.50 వేలు, చల్లపల్లి మండలం పాతమాజేరులో మృతిచెందిన కార్యకర్త రాజులపాటి సోమయ్య కుటుంబానికి రూ.25 వేలను ఆయన అందజేశారు. పాతమాజేరులో కమ్మెల ప్రభాకరరావుకు ప్రమాదం జరిగి కాలు తీసేయగా పరామర్శించి బ్యాటరీతో నడిచే వీల్‌చైర్‌ను అందిస్తానని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకుడు తుమ్మలగుంట గోపాలకృష్ణ కాలికి దెబ్బ తగలడంతో పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, మెండు లక్ష్మణరావు, కర్రా సుధాకర్, పరుచూరి దుర్గాప్రసాద్, నిడమానూరి దిలీప్‌కుమార్, రావెళ్ల విజయ్‌కుమార్, రావెళ్ల ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధిపై సమగ్ర నివేదిక అందించండి

● అధికారులకు ప్రత్యేకాధికారి సాయిబాబు ఆదేశం

కోడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశంలో మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించాలని, ప్రతి శాఖ వారు ప్రజాప్రతినిధులకు సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ప్రత్యేక అధికారి పి.సాయిబాబు ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తర్వాత జరిగే సమావేశంలో మండలంలో జరిగిన పురోగతిని వివరిస్తూ, అధికారులు తప్పనిసరిగా నివేదిక అందించాలని ఆదేశించారు. అందించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో సుధాప్రవీణ్, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయయణ, తహసీల్దార్ వీరాంజనేయప్రసాద్, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా గుత్తికొండ రామారావు

ఘంటసాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకుడు గుత్తికొండ రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఘంటసాల మండలం చిన్నకళ్లేపల్లిలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ 25వ మహాసభలో పార్టీ నాయకులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 13 మంది కార్యవర్గ సభ్యులు, నలుగురు ఆహ్వానితుల ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్యవర్గ సభ్యులుగా మాలెంపాటి కాంచనరావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మాలెంపాటి కోటేశ్వరరావు, అడ్డాడ ప్రసాద్‌బాబు, డొక్కు శ్రీనివాసరావు, కోదాటి నాగయ్య, కోడి రాధాకృష్ణ, పెనుమత్స రాజారత్నం, కొల్లూరి శ్రీధర్, మల్లుపెద్ది రత్నకుమారి, కంఠంనేని జ్యోత్స్నాదేవి, కంచర్ల ప్రభుకుమారిలు ఎన్నికయ్యారు. ఆహ్వానితులుగా పరుచూరి శ్రీనివాసరావు, పరిశె వెంకటస్వామి, నాగినేని శ్రీమన్నారాయణ, అట్లూరి సురేష్ ఎన్నికయ్యారు.

రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు

● ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు



పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న గొర్రెపాటి గోపీచంద్ కుంచే నాని తదితరులు

మచిలీపట్నం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడు అని, ఆయన ముందుచూపు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. పీవీ నరసింహారావు జయంతి వేడుకను పీవీ ఫణికుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన పార్కు వద్ద ఉన్న విగ్రహానికి గోపీచంద్, పలువురు నేతలు నివాళులర్పించారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామ చంద్రమూర్తి, గుమ్మడి విద్యాసాగర్, పుప్పాల ప్రసాద్, సూరిశెట్టి హరికృష్ణ, లంకిశెట్టి నీరజ పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న ముందడుగు గ్రామ మహిళలు

మంచినీటి పంపులు బాగు చేయండి

కోడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని ముందడుగు గ్రామం(11వ వార్డు)లో మంచినీటి పంపులు బాగుచేయాలని గ్రామ మహిళలు కోరుతున్నారు. ఆరు నెలలుగా పంపులు పని చేయడం లేదని, పంచాయతీ వారికి తెలియజేసినా స్పందించటం లేదని తెలిపారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పంపులు బాగుచేయాలని కోరుతున్నారు.

కూటమి పాలనలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

● తెలుగుయువత మండలాధ్యక్షుడు మేడికొండ విజయ్

నాగాయలంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో యువతకు గంజాయి, డ్రగ్స్‌ను చేరువ చేస్తే కూటమి ప్రభుత్వం గూగుల్ క్వాంటమ్ వ్యాలీ, సైన్స్ సిటీ, ఏరో స్పేస్ ప్రాజెక్టులతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు చేరువ చేస్తోందని తెలుగు యువత మండల అధ్యక్షుడు మేడికొండ విజయ్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యువతరం జగన్ రాక కోసం మళ్లీ ఎదురుచూడటం లేదన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలను కూటమి ప్రభుత్వం నిర్వహించి యువత అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. వైసీపీ ఓర్వలేక రాజకీయ లబ్ధి కోసం యువతను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టిస్తోందన్నారు. దళితుల ప్రాణాలంటే వైసీపీకి చులకన అన్నారు. గత ఐదేళ్ల పాలనలో దళితుల మానప్రాణాలు బలిగొన్న హంతకులకు వైసీపీ వత్తాసు పలికిందన్నారు. నేడు ఇదే తరహాలో దళితుడైన సింగయ్య ప్రాణాలు అన్యాయంగా బలిగొన్నా, వైసీపీ నేతలు మానవత్వాన్ని మరచి ప్రవర్తిస్తున్నారని మేడికొండ దుయ్యబట్టారు.



హంసలదీవి జట్టుకు ట్రోఫీ అందిస్తున్న మండలి వెంకట్రామ్, చిలకలపూడి పాపారావు

పాలకాయితిప్ప ప్రీమియర్ లీగ్ విజేత హంసలదీవి

కోడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యం పెంచుకుని జాతీయ స్థాయికి ఎదగాలని జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం పాలకాయితిప్ప సముద్ర తీరాన అటవీశాఖ సహకారంతో 20 రోజుల నుంచి నిర్వహిస్తున్న పాలకాయితిప్ప ప్రీమియర్ లీగ్ మండల స్థాయి క్రికెట్ పోటీల్లో శనివారం హంసలదీవి-పాలకాయితిప్ప జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. హంసలదీవి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు రూ.15 వేలు, రన్నర్ పాలకాయితిప్ప జట్టుకు సీహెచ్ బాలయ్య రూ.10 వేలు, మూడవ స్థానం పొందిన జట్టుకు సీహెచ్ ఆంజనేయులు రూ.7 వేలు అదించారు. విజేతలకు మండలి వెంకట్రామ్, చిలకలపూడి పాపారావు బహుమతులు అందజేశారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ, మర్రె గంగయ్య, కొండవీటి సునీత, కోట రాంబాబు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలంటూ రుద్రవరం గురుకుల విద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శనివారం రిలే దీక్షలు నిర్వహించారు. సెక్యూరిటీ సిబ్బంది టి.అరుణ్‌కుమార్, బి.రవికుమార్, పి.సుబ్బయ్య, కె.శామ్యూల్, బి.మురళి, పి.నరసింహరాజు దీక్షలో పాల్గొన్నారు.